క్లుప్తంగా

చేనేత పరిశ్రమను ఆదుకోవాలని వినతి



భట్టిప్రోలు: చేనేత కార్మికుల వరుస ఆత్మహత్యలను నివారించి చేనేత పరిశ్రమ రక్షణకు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం భట్టిప్రోలు మండల కమిటీ గురువారం తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ పరిశుద్ధరావుకు వినతి పత్రం అందజేసింది. చేనేత పరిశ్రమపై ప్రభుత్వం విధించిన జీఎస్టీని వెంటనే ఎత్తివేయాలని కోరారు. చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్‌లతో కూడిన చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని కార్యాలయ సూపరింటెండెంట్‌కు అందజేశారు. కార్యక్రమంలో సంఘం బాపట్ల జిల్లా కమిటీ సభ్యులు ఎం. సత్యన్నారాయణ, డి.సత్యన్నారాయణ, వీవర్స్ సొసైటీ మాజీ అధ్యక్షులు బి.నాగమల్లేశ్వరరావు, చేనేత, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎ.శ్రీనివాసరావు, పి.మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

భావన్నారాయణుని సన్నిధిలో అన్నదానం



బాపట్ల: శ్రీ క్షీర భావన్నారాయణ స్వామి రథోత్సవం సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ అన్నదాన కార్యక్రమం చేపట్టారు. తొలుత దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అన్నం సతీష్ ప్రభాకర్ భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ నరాలశెట్టి ప్రకాశరావు, కొటికం సుబ్బారావు, గురుస్వామి తదితరులు ఉన్నారు.

ఘనంగా బాబా ఆలయ వార్షికోత్సవం



రేపల్లె రూరల్: పట్టణంలోని ఇసుకపల్లిలో వేంచేసి యున్న శ్రీ షిర్డిసాయిబాబా ఆలయ వార్షికోత్సవ వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. సాయినాధునికి వేకువ జామునే సుప్రభాత సేవలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పువ్వులు, పట్టు వస్త్రాలతో అలంకరించారు. ఆలయ అర్చకులు సాయినాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు బాబా చరిత్రను వినిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాబావారికి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణంలో సాయి చాలీసా పారాయణం చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అన్నసంతర్పణ నిర్వహించారు.

రేపు జిల్లా జూనియర్ బాలికల రగ్బీ జట్టుకు ఎంపికలు

కర్లపాలెం: బాపట్ల జిల్లా జూనియర్ బాలికల రగ్బీ జట్టు ఎంపిక ఈ నెల 25న కర్లపాలెంలోని పీకేఆర్ జూనియర్ కళాశాలలో జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా రగ్బీ అసోసియేషన్ కార్యదర్శి పిట్టు సుబ్బారెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. రగ్బీ సెలక్షన్స్‌కు వచ్చే క్రీడాకారులు తమ ఆధార్ కార్డు, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ వెంట తీసుకుని రావాలని కోరారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు 7702564907, 9032141718 నంబర్లలో సంప్రదించాలని కోరారు. జిల్లా జూనియర్స్ బాలికల రగ్బీ జట్టుకు ఎంపికైన వారు జిల్లా తరఫున విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు.

వెంకటేశ్వరరెడ్డి బాధ్యతల స్వీకరణ

కొరిటెపాడు(గుంటూరు): గత నాలుగు మాసాలుగా సెలవులో కొనసాగుతున్న గుంటూరు మార్కెట్ యార్డు కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి ఏపీ వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ పి.ప్రశాంతి ఉత్తర్వుల మేరకు గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇన్‌ఛార్జి కార్యదర్శిగా కొనసాగిన కాకుమాను శ్రీనివాసరావు నుంచి వెంకటేశ్వరరెడ్డి ఛార్జి తీసుకున్నారు. వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ ప్రశాంతి ఉత్తర్వుల మేరకు వెంకటేశ్వరరెడ్డి సెలవులను రద్దు చేసుకొని యార్డు క్యాదర్శిగా తిరిగి విధుల్లో చేరి రిపోర్ట్ చేశారు.

అంగరంగ వైభవంగా సిడిమాను ఊరేగింపు

- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- హాజరైన ఎంపీ మోపిదేవి దంపతులు



ప్రత్యేక అలంకరణలో గుండి పార్వతి అమ్మవారు



పూజల్లో ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు దంపతులు

నిజాంపట్నం: వేలాది మంది భక్తుల నామస్మరణ మధ్య విద్యుత్ కాంతుల అలంకరణతో సిడిమాను ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. నిజాంపట్నంలోని శ్రీమొగదారమ్మ తల్లి ఉత్సవాలలో భాగంగా గ్రామ వీధులలో ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్తులు అడుగడుగునా సిడిమానుకు పూజలు నిర్వహించి తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు.రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు దంపతులు సిడిమానుకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం మొగదారమ్మ తల్లి ఆలయంలో పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి మొక్కుబడులను చెల్లించి నైవేద్యాలు సమర్పించారు. ఉత్సవాలలో వేలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో ఆలయ ప్రాగణం భక్తులతో పోటెత్తింది.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు స్థానికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమాలను తిలకించేందుకు ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన కోలాటం పలువురిని విశేషంగా ఆకట్టుకుంది. కోలాటం నిర్వహించిన చిన్నారులను ఎంపీ మోపిదేవి దంపతులతో పాటు కుటుంబ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా గుండి పార్వతి అమ్మవారి ఉత్సవాలు

భట్టిప్రోలు: భట్టిప్రోలు హిందూ శ్మశాన వాటికలో కొలువైన శ్రీ గుండి పార్వతి అమ్మవారి వార్షిక మహోత్సవాలలో భాగంగా గురువారం భక్తులు అమ్మవారిని అధిక సంఖ్యలో దర్శించుకుని తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. భక్తులు అమ్మవారికి పొంగళ్లు సమర్పించి తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. అమ్మవారికి ఆబాలగోపాలం పూజలు నిర్వహించారు. సాయంత్రం నుంచి అమ్మవారి సన్నిధికి ప్రభలు కట్టుకుని తీసుకువచ్చారు. అమ్మవారిని ఆరాధించే ప్రతి ఇంటా పండుగ వాతావరణం నెలకొంది. బంధువులను పిలుచుకుని సంబరాలను అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ప్రతి ఏటా అమ్మవారి జాతర మహోత్సవాలు క్రమం తప్పకుండా జరుగుతాయి. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ ప్రభ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉత్సవాలలో భాగంగా దేవాలయ ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఘనంగా మద్దిరాలమ్మ తిరునాళ్ల

నగరం: మండలంలోని ఏలేటిపాలెం గ్రామ దేవత శ్రీమద్దిరాలమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాన్ని గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ పూజారులు సాంప్రదాయ బద్ధంగా అమ్మవారిని ఆలయంలో పునః ప్రవేశ పెట్టారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. ఏలేటిపాలెం, బెల్లంవారిపాలెం, చిరకాలవారిపాలెం, బొరమాదిగపల్లి, చల్లమ్మ అగ్రహారం గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. తిరునాళ్ల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.



ఘటం కుండను అమ్మవారి సన్నిధికి తీసుకు వెళుతున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో మద్దిరాలమ్మ



పూజల్లో పాల్గొన్న భక్తులు

వైభవంగా కేదారేశ్వరుని కల్యాణం



కేదారేశ్వరునికి అభిషేకాలు చేస్తున్న భక్తులు



స్వామి కల్యాణం నిర్వహిస్తున్న వైదికులు

సూరేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం సూరేపల్లి గ్రామంలో కొలువైన శ్రీ కేదారేశ్వర వాయులింగ ఆలయంలో స్వామివారికి వైశాఖ పౌర్ణమి పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. స్వామివార్లకు భక్తులే అభిషేకం నిర్వహించడం ఇక్కడ ప్రత్యేకత. రాత్రి స్వామివారి కల్యాణం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య కన్నుల పండువగా నిర్వహించారు. కల్యాణంలో తాడేపల్లి శివ సుబ్రహ్మణ్యం-రమాదేవి దంపతులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలను అర్చకులు కంతేటి శివరామకృష్ణ శర్మ శాస్త్రోక్తంగా నిర్వహించారు. శివ నామ స్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి.

నేత్రానందంగా నరసింహ స్వామి కల్యాణం



యడ్లపల్లి(భట్టిప్రోలు): చుండూరు మండలం యడ్లపల్లి గ్రామంలో కొలువైన శ్రీ రాజ్యలక్ష్మీ గోదాదేవి సమేత శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి వార్ల కల్యాణం బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్వామి వార్లను ప్రత్యేక అలంకారంలో తీర్చిదిద్దారు. దేవాలయ ప్రధాన అర్చకులు దీవి శ్రీనివాసాచార్యులు, యాజ్ఞీకులు అగ్నిహోత్రం శేషాచార్యులు ఆధ్వర్యంలో పొన్నపల్లి సత్యన్నారాయణ పూజా కార్యక్రమాలను శాస్త్రయుక్తంగా నిర్వహించారు. కార్యక్రమాలను వంశ పారంపర్య ధర్మకర్తలు ఆలపాటి సుబ్బయ్య, కార్యనిర్వాహణాధికారి గద్దె వెంకట అమర్‌నాథ్‌లు పర్యవేక్షించారు.

వేగవంతంగా దివ్యాంగ చిన్నారుల సర్వే



భట్టిప్రోలు: ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష ఆదేశానుసారం మండలంలోని దివ్యాంగులైన చిన్నారుల సర్వే వేగవంతంగా నిర్వహిస్తున్నట్లు ఎంఈవో-2 నీలం దేవరాజు తెలిపారు. గురువారం భట్టిప్రోలు మండలంలో నిర్వహించిన ఈ సర్వేలో ఆయన పాల్గొన్నారు. దేవరాజు మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు చిన్నారుల సర్వే జూన్ 9వ తేదీ వరకు జరుగుతుందని చెప్పారు. దివ్యాంగులైన చిన్నారుల బడిబాట దిశగా ఈ సర్వే జరుగుతుందని తెలిపారు. ఇప్పటి వరకు 13 మంది చిన్నారులను గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ సర్వేకు ప్రతి ఒక్కరి సహకారంతో పాటు తల్లిదండ్రుల తోడ్పాటు ఎంతో అవసరమని వివరించారు. కార్యక్రమంలో ఐఈడీ టీచర్లు డీఎం .ఇవాంజలింగ్, కె.రత్నాకర్‌లు పాల్గొన్నారు.

నాణ్యమైన సిమెంట్‌తో నిర్మాణాలు పదిలం

భారతి సిమెంట్స్ అసిస్టెంట్ మేనేజర్ పూల సురేష్

చెరుకుపల్లి: శాశ్వతమైన భవన నిర్మాణాలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తయారు చేయబడిన నాణ్యమైన సిమెంట్ ఎంచుకోవాలని భారతి సిమెంట్స్ అసిస్టెంట్ మేనేజర్ (మార్కెటింగ్) పూల సురేష్, సీనియర్ టెక్నికల్ అధికారి ఎస్.భవానీశంకర్ సూచించారు. మండలంలోని కనగాల గ్రామంలోని చందన ట్రేడర్స్‌లో భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో గురువారం భవన నిర్మాణ మేస్త్రీలు, కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ అధునాతన పరిజ్ఞానంతో భారతి సిమెంట్ తయారవుతుందని తెలిపారు. కట్టడాలు పూర్తి నాణ్యతతో దీర్ఘకాలం మన్నేందుకు దోహద పడుతుందన్నారు. సిమెంట్ తయారీకి నాణ్యమైన ముడి పదార్థాలనే తమ కంపెనీ ఎంచుకుంటుందని వివరించారు. భవానీశంకర్ మాట్లాడుతూ భారతి సిమెంట్ వినియోగించిన కాంక్రీట్‌తో వేసిన శ్లాబులను ఏడు రోజుల అనంతరం తమ కంపెనీ ప్రతినిధులు వచ్చి నాణ్యతా పరీక్షలను చేసి భారతి సిమెంట్ నాణ్యతను భవన నిర్మాణ మేస్త్రీలు, యజమానులకు వివరిస్తామని చెప్పారు. ఇందుకు సంబంధింత డీలరు ద్వారా వివరాలు తెలుసుకుని తమకు సమాచారం అందిస్తే సరిపోతుందన్నారు. మేస్త్రీల సందేహాలను నివృత్తి చేశారు. సదస్సుకు హాజరైన మేస్త్రీలు, కార్మికులకు రూ.లక్ష చొప్పున ఉచిత బీమా సదుపాయం కల్పించి బాండ్లను అందజేశారు. చందనా ట్రేడర్స్ ప్రొప్రైటర్ పి.వెంకటరెడ్డి, ఇతర డీలర్లు, భవన నిర్మాణ మేస్త్రీలు, కార్మికులు పాల్గొన్నారు.



బీమా బాండ్ అందజేస్తున్న అసిస్టెంట్ మేనేజర్ సురేష్, భవానీ శంకర్

వైభవంగా అన్నమయ్య జయంతి

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో గురువారం అన్నమయ్య జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆలయ అర్చకులు సతీష్ స్వామి ఆధ్వర్యంలో మూల విరాట్‌కు ప్రత్యేక అర్చనలు, అలంకరణ జరిగాయి. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, ఎంవై.శేషురాణి, కాజా వేంకటసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కొనసాగిన ధారావాహిక ప్రవచనం

స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై ఐదు రోజులపాటు నిర్వహిస్తోన్న శ్రీమద్భగవద్గీత – ఆత్మ సంయమయోగః ధారా వాహిక ప్రవచనం గురువారం కొనసాగింది. ఆలయ అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. జరుబుల బంగారుబాబు సౌజన్యంతో పూజ్యశ్రీ సువీరానందస్వామి (చిన్మయ మిషన్) నిర్వహించారు.



అన్నమయ్య జయంతి వేడుకల్లో..

భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

రేపల్లె రూరల్: ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులను గుర్తించి భవిత కేంద్రాల ద్వారా విద్యా బుద్ధుల్ని అందించేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఎంఈవోలు కేసనశెట్టి సురేష్, రత్నశ్రీధర్‌లు తెలిపారు. జిల్లా సమగ్ర శిక్ష ఆదేశానుసారం భవిత సిబ్బంది ఆధ్వర్యంలో రేపల్లె పట్టణ, మండలంలో నిర్వహిస్తున్న 0 నుంచి 18 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల గుర్తింపు సర్వేను గురువారం పరిశీలించి అనంతరం వారు మాట్లాడారు. మానసిక వైకల్యం కలిగిన చిన్నారులకు భవిత కేంద్రంలో ఆట పాటలతో కూడిన విద్యను అందించి వీరిని సాధారణ విద్యార్థుల వలె తీర్చిదిద్దటం జరుగుతుందన్నారు. విద్య బుద్ధులతో పాటు ఫిజియోథెరపీ, ఆటలలో ప్రత్యేక శిక్షణ అందించబడుతుందని చెప్పారు. తల్లిదండ్రులు తమ చిన్నారులు ఎటువంటి వైకల్యానికి గురైన భవిత కేంద్రంలో గానీ, సర్వేకు వచ్చిన భవిత సిబ్బందికి గాని వివరాలను తెలియజేసి సహకరించాలన్నారు. చిన్నారులను తల్లిదండ్రులు కనీసం తమ సమీపంలోని పాఠశాలలకైనా పంపాలని కోరారు. శిక్షణ పొందిన చిన్నారులు తమ కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వినికిడి, దృష్టి లోపం, బుద్ధి మాంద్యం, ఆటిజం, శారీరక వైకల్యం వంటి 21 రకాల లోపాలు ఉన్న చిన్నారులను గుర్తించి సమాచారం సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. సర్వే జూన్ 9వ తేదీ వరకు కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేటర్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.



సర్వే నిర్వహిస్తున్న స్పెషల్ ఎడ్యుకేటర్ అనురాధ

బుద్ధుని బోధనలు మానవాళికి అనుసరణీయం

కోళ్లపాలెం(భట్టిప్రోలు): బుద్ధుని బోధనలు సర్వ మానవాళికి ఆచరణీయమని ఆది ఆంధ్ర నవ బుద్ధిస్ట్ సొసైటీ అధ్యక్షులు, న్యాయవాది దోవా రమేష్ రామ్‌జీ పేర్కొన్నారు. బుద్ధపౌర్ణమి పురస్కరించుకుని భట్టిప్రోలు మండలం పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని కోళ్లపాలెంలో గురువారం బుద్ధుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రామ్‌జీ మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటిచెప్పిన అంబేడ్కర్ నవ బుద్ధుడని తెలిపారు. మానవాళికి స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వంతో కూడిన విధానమే శరణ్యమని ప్రబోధించిన మహనీయుడు అంబేడ్కర్ అని చెప్పారు. తెనాలి డెల్టా ప్రాంతంలో అంబేడ్కరిజం, బుద్ధిజం కోసం జి.లాజరస్, జి.దయారత్నంల పాత్ర మరపురానిదని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎ. బ్రహ్మేశ్వరరావు, కె.కిషోర్, సొసైటీ సభ్యులు పి.నాగేశ్వరరావు, కె. బాబురావు, పి.శివ వెంకటేశ్వరరావు, అంబేడ్కర్ యూత్ నాయకులు జె.భాను, డి.రఘు, జి.బాబ్జి, ఎస్.వాసుబాబు, ఎం. కిరణ్‌కుమార్, కె.నాంచారయ్య పాల్గొన్నారు.



కోళ్లపాలెంలో బుద్ధుని విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నిర్వాహకులు



ఐలవరం జెడ్పీ ఉన్నత పాఠశాల 2000-2001వ బ్యాచ్ పూర్వ విద్యార్థులు

గుర్తుకొచ్చిన పాత జ్ఞాపకాలు

ఐలవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఐలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000–2001లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం గురువారం జరిగింది. పూర్వ విద్యార్థులంతా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని కుశల ప్రశ్నలు వేసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వీరు 24 ఏళ్ల తరువాత తమ చదువుల బడిలో కలుసుకున్నారు. నాడు చదువుకున్న 150 మంది విద్యార్థులకు గానూ 130 మంది హాజరయ్యారు. వచ్చే ఏడాది సిల్వర్‌జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేయాలని తీర్మానించారు. నాటి తీపి జ్ఞాపకాలను నెమర వేసుకున్నారు. ఆర్థికంగా వెనుకబడిన తోటి స్నేహితులకు తోడ్పాటు అందించాలని తీర్మానించుకున్నారు. కార్యక్రమాన్ని ఆర్గనైజర్లు జొన్నాదుల విజయ్‌కుమార్, పట్టెం సరోజ, ఈడె శివ రామకృష్ణ, మహ్మద్ రఫీ, పట్టెం సాంబశివరావు, బట్టు లలిత కుమార్, మాచర్ల వీరేంద్ర, గోలి సోమశేఖర్, పడమటి వెంకట ప్రసాద్‌లు పర్యవేక్షించారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

పట్నంబజారు: ఆటో డ్రైవర్లు పూర్తిస్థాయిలో నిబంధనలకనుగుణంగా నడుచుకోవాలని డీటీసీ షేక్ కరీమ్ చెప్పారు. స్వర్ణభారతీ నగర్‌లోని ఆర్టీఏ కార్యాలయంలో గురువారం డీటీసీ కరీమ్ గుంటూరు ట్రాఫిక్ డీఎస్పీ వి.వి.నాయుడు, ట్రక్కు, ప్యాసింజర్ ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రైవింగ్ చేసే సమయంలో తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలను వివరించారు. ఈ సందర్భంగా డీటీసీ మాట్లాడుతూ రోడ్డుపైకి వచ్చే ప్రతి వాహనానికి ఖచ్చితంగా ధృవీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు. ట్రాఫిక్ డీఎస్పీ వి.వి.నాయుడు మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లైసెన్సు లేకుండా డ్రైవింగ్ చేస్తే రూ.5వేలు, మద్యం సేవించి నడిపితే రూ.15వేలు, ర్యాష్ డ్రైవింగ్‌కు రూ. 10వేలతో పాటు ప్రతి ఒక్క నిబంధన ఉల్లంఘనకు భారీ జరిమానాలు పడే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ వెస్ట్ సీఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీటీసీ షేక్ కరీం, పక్కన డీఎస్పీ వి.వి.నాయుడు

ముగిసిన తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు

కాకుమాను: పెదనందిపాడు మండలంలోని వరగాని అంకమ్మ తల్లి గుడి ఆవరణలో గత మూడు రోజుల నుంచి లావు వెంకటేశ్వర్లు, కల్లూరి నాగేశ్వరరావు కళా పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు గురువారం రాత్రితో ముగిశాయి. చివరి రోజు చైతన్య కళాభారతి కరీంనగర్ వారి 'స్వప్నం రాల్చిన అమృతం', అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారి 'మనస్విని', ఉషోదయ కళానికేతన్ కట్రపాడు వారి 'విముక్తి' నాటికలు నిర్వహించారు. చివరి రోజు నిర్వహించిన నాటిక పోటీలు ఆహూతులను అలరించాయి.



నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

రేపల్లె రూరల్: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రేపల్లె మండల పరిధిలోని గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆ శాఖ డీఈఈ టి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

వేసవి విజ్ఞాన శిబిరాన్ని వినియోగించుకోండి

పెదకాకాని: ప్రభుత్వం వేసవిలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలని విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు పి గోపాలరావు అన్నారు. పెదకాకాని లూథర్‌గిరి కాలనీలో గ్రంథాలయాధికారి వేముల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. శిబిరానికి గురువారం రిసోర్స్ పర్సన్‌గా పి గోపాలరావు పాల్గొని విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులతో గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలు చదివించడం, వారికి నీతి కథలు చెప్పటంతో పాటు వారిచేత కథలు చెప్పించటం వంటి కృత్యాలను చేయించారు. అనంతరం పద్యాల పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మహనీయుల జీవిత చరిత్ర పుస్తకాలు చదివి వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని సూచించారు. 'చిరిగిన చొక్కా తొడుక్కో...ఒక మంచి పుస్తకం కొనుక్కో' అనే మాదిరిగా పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలను వాటి ఉపయోగాలను గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులంతా ఈ సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.